క్లుప్తంగా

నేడు మున్సిపల్ సమావేశం

పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీ అత్యవసర సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అలీమ్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 27వ తేదీ నుంచి వార్డు బాట కార్యక్రమం ప్రారంభిస్తుండడంతో కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

రైతులకు రాగులు పంపిణీ


రాగి విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్‌లు

చౌడేపల్లె: రాగిపంట సాగుపై రైతులు ఆసక్తి చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచితంగా రాగి విత్తనాలు పంపిణీ చేస్తోందని సర్పంచ్‌లు జయసుధమ్మ, రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం కొండామర్రి రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాగులను పంపిణీ చేశారు. రైతులు సాగుచేసిన రాగులను ప్రభుత్వమే క్వింటాల్ రూ.3,800 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ నవీన్ పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఈఓ

బైరెడ్డిపల్లె: మండలంలోని బెల్లంమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన చిరంజీవి(గణితం), నాగభూషణం (సోషియల్), బాలక్రిష్ణమూర్తి (తెలుగు), ముంతాజ్ (హిందీ), గిరిరాజా (ఎస్‌జీటీ) ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను ఎంఈఓ సాయిలీల కొనియాడారు. హెచ్‌ఎంలు లలితమ్మ, సురేఖ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టుపురుగుల పెంపకంతో అధిక ఆదాయం

రొంపిచెర్ల: పట్టు పురుగుల పెంపకంతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చని పట్టుపరిశ్రమ సహాయ సంచాలకుడు మోహన్‌బాబు అన్నారు. బుధవారం రొంపిచెర్ల–2 ఆర్బీకేలో రైతులకు అవగాహన కల్పించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న కమిషనర్

పుంగనూరు: జగనన్న సురక్షలో అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం 3వ సచివాలయం పరిధిలోని ఉబేదుల్లాకాంపౌండు, రహమత్‌నగర్, చెంగలాపురం ప్రాంతాల్లో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ముతో కలిసి సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 272 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 1643 అర్జీలు స్వీకరించామన్నారు. వాటిలో 1579 పరిష్కరించామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, కౌన్సిలర్ సాజిదాబేగం పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందితో సమీక్ష

చౌడేపల్లె: ఉపాధిహామీ పథకం ద్వారా గుంతలు తీసిన రైతులు వారంలోగా మామిడి మొక్కలు నాటాలని ఏపీఓ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో మొక్కలు త్వరగా నాటేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రజల చెంతకే పాలన


ధ్రువపత్రాలు అందజేస్తున్న కౌన్సిలర్లు

పలమనేరు/పెద్దపంజాణి/సదుం/సోమల/చౌడేపల్లె: ప్రజల చెంతకే పాలన అందించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎంపీపీలు ఎల్లప్ప, రామ్మూర్తి, ఈశ్వరయ్య అన్నారు. బుధవారం పలమనేరు మున్సిపాలిటీలోని కొత్తపేట 22, 23 సచివాలయాలు, పెద్దపంజాణి మండలం నాగిరెడ్డిపల్లె, సదుం మండలం పాలమంద, సోమలలోని పెద్ద ఉప్పరపల్లె, చౌడేపల్లెలోని వెంగళపల్లె సచివాలయాల్లో ధ్రువపత్రాలు అందజేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యులు సుష్మకీర్తి, సోమశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు బాగా రెడ్డి, గంగాధరం, సర్పంచ్‌లు కుమారమ్మ, మనోహర్‌రెడ్డి, మల్లికార్జుననాయుడు, భారతి, నాగరత్న పాల్గొన్నారు.

జగనన్నతోనే సామాజిక అభివృద్ధి

- పల్లెబాటలో నాయకులు


ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న పెద్దిరెడ్డి


శివరామపురంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్సీలు

శాంతిపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం అభివృద్ధి చెందుతోందని జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్సీలు అన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శాంతిపురం మండలంలో నిర్వహిస్తున్న పల్లెబాట కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. చంద్రబాబు మోసాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మోసపూరిత హామీలతో మోసం చేయడం, అబద్ధాలను నిజమని ప్రచారం చేయడం బాబు నైజమని పేర్కొన్నారు.

నేడు శాంతిపురం మండలంలోనే..

శాంతిపురం: రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పల్లెబాట కార్యక్రమం గురువారం శాంతిపురం మండలంలో కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి తెలిపారు. ఉదయం 9 గంటలకు 64 పెద్దూరులో ప్రారంభమై సి.బండపల్లి, రాళ్లబూదుగూరు, 121 పెద్దూరు, అనికెర, చెంగుబళ్ల, గుంజార్లపల్లిలో పర్యటిస్తారని చెప్పారు. సాయంత్రం 4.30 గంటలకు శాంతిపురంలో జరిగే బహిరంగ సభలో మంత్రి ప్రసంగిస్తారని తెలిపారు.

మాయలోడితో భద్రం

అబద్ధాలతో జనాన్ని మోసం చేయడం, అధికారం చేతికి వస్తే దోచుకోవడం చంద్రబాబు అజెండాగా పెట్టుకున్నారు. ఓట్ల కోసం ఎన్ని అబద్ధాలనైనా కళ్లు ఆర్పకుండా చెప్పేస్తాడు. తెలుగు తమ్ముళ్లు వాటిని జనం చెవిలో జోరీగల్లా ప్రచారం చేస్తారు. ఇంటికో ఉద్యోగం, వ్యవసాయ–డ్వాక్రా రుణాల మాఫీ, మీ ఇంటికి మీ బంగారం ఇలా చెబుతూ పోతే వాళ్ల మోసాలు ఎన్నో. ప్రజలను ఓటరుగా చూసే చంద్రబాబు ఐదేళ్లకు ఒకసారి కుప్పం వస్తే, ప్రజలను ప్రేమించే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాలుగేళ్లలో 40 సార్లు వచ్చారు. ఎవరికి కష్టం వచ్చినా అండగా నిలుస్తున్నారు. ఎమ్మెల్సీ భరత్, ఎంపీగా రెడ్డెప్ప గెలిస్తే నిత్యం మీకు అండగా ఉంటారు. – గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

ఆయనొస్తే ఆల్ ఔట్

చంద్రబాబు జీవితంలో మళ్లీ సీఎం కాలేడు. కానీ పొరపాటున ఆయన గెలిస్తే సంక్షేమ పథకాలు, గ్రామ సచివాలయాలు, వలంటీర్లు ఇలా ఏవీ లేకుండా పోతాయి. భస్మాసురుడికి అధికారం ఇస్తే ఆల్ ఔట్. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని తీర్చడానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ భరత్, నేను నిత్యం కుప్పం ప్రజలకు అందుబాటులో ఉంటున్నాం. కానీ 35 ఏళ్లుగా ఇక్కడి ప్రజల ఓట్లతో ఎన్నో పదవులు పొందిన చంద్రబాబు ఎక్కడ ఉన్నాడా ? కరోనా లాంటి మహమ్మారితో జనం వనికిపోతే వలంటీర్లతో సహా మేమంతా జనంలోనే ఉన్నాం. కానీ ఆయన, ఆయన కొడుకు హైదరాబాదులో దాక్కున్నారు. – రెడ్డెప్ప, ఎంపీ

నిత్యం అందుబాటులో ఉంటా

నేను కుప్పంలోనే ప్రజలకు అందుబాటులో ఉంటున్నాను. కానీ ఇక్కడ ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి ఎక్కడ ఉంటున్నాడో అందరికీ తెలుసు. ఎవరైనా, ఎప్పుడైనా తమ కష్టాలు చెబితే మంత్రి, ఎంపీ, సీఎం సహకారంతో వాటిని తీరుస్తాం. కానీ ఎమ్మెల్యేగా ఉన్న చంద్రబాబును ఏ సమాన్యుడైనా కలిసి తమ కష్టం చెప్పగలడా ? ఆయన ఎప్పుడు కుప్పం వస్తారో, ఎక్కడ ఉంటారో జనానికి తెలియదు. 35 ఏళ్లుగా బాబును నెత్తిన పెట్టుకున్న గ్రామాల్లో కూడా ఇప్పటికీ కనీస వసతులు లేవు. నామినేషన్ వేయటానికి, ఓటు అడగడానికి కూడా రాకుండా కుప్పం ప్రజలను అవమానిస్తున్న వ్యక్తికి తగిన బుద్ధి చెప్పండి. – ఎమ్మెల్సీ భరత్

బడుగులకు వరం

బీసీ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పదవులు ఇచ్చారు. వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారు. అందరి కష్టాలు, అవసరాలు తెలుసుకుని తీరుస్తున్నారు. కానీ చంద్రబాబు బీసీ, ఎస్సీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారు. పెద్ద బీసీ, పెద్ద మాదిగ అని పోజులు కొట్టాడే తప్పా ఆయా వర్గాలకు మేలు చేసింది ఏమీ లేదు. కానీ ఇప్పుడు ప్రభుత్వ పథకాల అండతో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదుగుతోంది. అందుకే మళ్లీ వెనకబడిన వర్గాల వారిని వెనక్కు నెట్టాలని సెమీ మ్యానిఫెస్టో అంటూ ఆ మాయల మరాఠీ కొత్త మోసాలకు తెర తీస్తున్నారు. – సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

యాసిడ్ విక్రయాలపై ఆంక్షలు

- పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి


గోల్డ్‌స్మిత్‌ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

పలమనేరు: పలమనేరు సబ్‌డివిజన్ పరిధిలో యాసిడ్ విక్రయదారులు, బంగారు నగలను తయారు చేసే గోల్డ్‌స్మిత్‌లు ఇకపై ఎవరికిపడితే వారికి యాసిడ్‌ను విక్రయిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. బాలికలు, విద్యార్థినులు, మహిళలపై యాసిడ్ దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల్లో భాగంగా గంగవరం సర్కిల్ కార్యాలయంలో బంగారు వ్యాపారులు, గోల్డ్ స్మిత్‌లు, యాసిడ్ అమ్మకపు దారులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఇతరులకు యాసిడ్ విక్రయించరాదన్నారు. యాసిడ్ అమ్మేవాళ్లు సైతం ఎవరు కొనుగోలు చేస్తున్నారో వారి ఆధార్ వివరాలతో పాటు సెల్‌నంబర్‌ను విధిగా తీసుకోవాలని సూచించారు. తరచూ యాసిడ్ విక్రయించే దుకాణాలపై దాడులు నిర్వహిస్తామని తెలిపారు. పలమనేరు, గంగవరం, పుంగనూరు రూరల్ సీఐలు చంద్రశేఖర్, అశోక్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

మంగళ్‌పాండేకు ఘన నివాళి

పలమనేరు: స్వాతంత్ర సమరయోధుడు మంగళ్‌పాండే జయంతిని పురస్కరించుకుని బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు అబ్బారి తాతయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం


సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ

వి.కోట: ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీపీ యువరాజు అన్నారు. బుధవారం మండలంలోని ముదరం దొడ్డి గ్రామ సచివాలయ పరిధిలో జెడ్పీ నిధులు రూ.16.60 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. మండలంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల కమిటీ చైర్మన్ అమరనాథ్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, సర్పంచ్ దామోదరం, ఎంపీటీసీ సయ్యద్ ఫజిల్, డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ సేటు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లకు వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు, కెనాన్ టెక్నీషియన్లు

పలమనేరు: నియోజకవర్గంలోని ఫొటోగ్రాఫర్లకు కెమెరా సాంకేతిక పరిజ్ఞానం, కొత్త ఫీచర్లపై అగాహన కల్పించేలా ప్రముఖ కెమెరా సంస్థ కెనాన్ టెక్నికల్ బృందం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో బుధవారం వర్క్‌షాపు నిర్వహించింది. కొత్తగా వచ్చిన టెక్నాలజీపై, ఫ్యూచర్లపై విపులంగా వివరించారు. కెనాన్ సంస్థకు చెందిన వరుణ్, వాసు, మోహన్‌రాజ్, పలమనేరు ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు భూపాల్ కుమార్, రాజేష్, మునేగౌడ, ప్రభు పాల్గొన్నారు.

రూ.34 కోట్లతో బడబళ్లవంక ప్రాజెక్టు


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

రొంపిచెర్ల: రొంపిచెర్ల–పులిచెర్ల మండలాల సరిహద్దులోని బడబళ్ల వంకపై రూ.34 కోట్లతో సాగునీటి ప్రాజెక్టు నిర్మిస్తున్నట్లు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ.. బడ బళ్లవంక ప్రాజెక్టు పనులు 70 శాతం పూర్తయినట్లు చెప్పారు. అలాగే రూ.38 లక్షలతో కదిరప్పనాయుని చెరువు పనులు జరుగుతున్నాయని తెలిపారు. మండలంలో 2020 ఇళ్లు మంజూరు కాగా 862 ఇళ్లు పూర్తయినట్లు చెప్పారు. జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లకు అదనంగా మరో రూ.12 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ అమరనాథ్ మాట్లాడుతూ.. చల్లిపల్లె సాగునీటి ప్రాజెక్టు ముంపు భూములకు రూ.8.92 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. వారంలో రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామన్నారు. పశు వైద్యాధికారి శ్రీధర్ మాట్లాడుతూ.. మండలానికి 24 గడ్డి కత్తరించే యంత్రాలు మంజూరు అయినట్లు తెలిపారు. కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రొంపిచెర్ల పీహెచ్‌సీలో 6 బెడ్లకు 2 మాత్రమే ఉన్నాయని.. కొరతను నివారించాలని మండల విద్యాధికారి రాజేశ్వరి కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పులు ఎందుకు చేయడం లేదని ఎంపీపీ ప్రశ్నించారు. మొదటి కాన్పు కష్టం అవుతుందని పీలేరుకు రెఫర్ చేస్తున్నామని రాజేశ్వరి తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్ర, ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, ఏఓ సు. ధారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీషా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మదర్‌థెరిసా విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన ప్రాంగణ ఎంపికలో 8 మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరెస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. సీఎస్ఈ, ఈసీఈ విభాగాలకు చెందిన విద్యార్థులు బెంగళూరులోని కాలివ్యయమ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఏడాదికి రూ. 5 లక్షల ప్యాకేజీతో ఎంపికయ్యారన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే ఉద్యోగంలో చేరాలన్నారు. విద్యార్థులను చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి అభినందించారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం


మునుస్వామి (ఫైల్)

సోమల: మండలంలోని ఆవులపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ సర్పంచ్ మునుస్వామి (87) బుధవారం మృతి చెందారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఫోన్‌లో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, సర్పంచ్ కొదండరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు, మల్లప్ప నివాళులర్పించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి ఆర్థిక సాయం

రామకుప్పం: మండలంలోని ననియాల తండా గ్రామానికి చెందిన లచ్చునాయక్ కుమార్తె వైశాలి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక యువత విద్యాసామాగ్రి కోసం రూ. 2 వేల ఆర్థికసాయం అందజేశారు. గిరిజన తండాకు చెందిన వైశాలి ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడం సంతోషంగా ఉందని గ్రామస్తులు అన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పలమనేరు: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఉద్యోగులు బుధవారం పాలభిషేకం చేశారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. తక్కువ పెన్షన్ తీసుకుంటున్న ఏపీపీటీడీ ఉద్యోగులకు అధిక పింఛన్ వచ్చేలా అవకాశం కల్పించిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ స్వామి, సూపర్‌వైజర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో నగదు రహిత చెల్లింపులు


సేవలను ప్రారంభిస్తున్న అధికారులు

పలమనేరు: సచివాలయాల్లో సేవలకు నగదు రహిత చెల్లింపులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఈఓపీఆర్డీ గిరిధర్ అన్నారు. మండలంలోని టి.వడ్డూరు గ్రామ సచివాలయంలో బుధవారం నగదు రహిత సేవలను ప్రారంభించారు. యూపీఐ పేమెంట్లు ఎక్కువైన నేపథ్యంలో ప్రజలు డిజిటల్ సేవలకు అలవాటు పడ్డారన్నారు. ఈ క్రమంలో ప్రజలకు సేవలందించాలనే తలంపుతో ప్రభుత్వం ఈ సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. సర్పంచ్ మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యసిబ్బంది

బైరెడ్డిపల్లె: గర్భిణులు, బాలింతలు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. ఈ మేరకు బైరెడ్డిపల్లెలో బుధవారం మహిళలకు అవగాహన కల్పించారు. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు, మాంసం, చేపలు, పప్పు దినుసులు బాగా తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, వైద్య సిబ్బంది లక్ష్మి, రాజేశ్వరి, ముబీనా, జయమ్మ పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి


రైతులకు సూచనలిస్తున్న అనిల్‌కుమార్

చౌడేపల్లె: మల్బరీ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని పట్టుపరిశ్రమశాఖ అధికారి వి.అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం పెద్దకొండామర్రి రైతు భరోసా కేంద్రంలో మల్బరీ సాగు రైతులతో సమావేశం జరిగింది. పట్టు రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలతో పాటు ఆర్థికంగా చేయూతనిస్తోందన్నారు. ఉపాధిహామీ పథకం నిధుల అనుసంధానంతో మల్బరీ సాగు కోసం ప్రభుత్వం రెండేళ్లపాటు ఆర్థిక సహాయం చేస్తుందన్నారు. అలాగే షెడ్ల నిర్మాణానికి పట్టుపరిశ్రమశాఖతో పాటు ఉపాధి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

గడప గడపలో అదే ఆదరణ

- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం
- సంక్షేమ లబ్ధిని వివరించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ


ప్రజలకు సంక్షేమ బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వస్తున్న ఆదరణే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. గంగవరం మండలం గండ్రాజుపల్లి–1, 2 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. ప్రజలు, నాయకులు ఆయన ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని పలు సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. గండ్రాజుపల్లి, మర్రిమాకులపల్లి గ్రామాల్లో మురుగు కాలువలు నిర్మించాలని ప్రజలు కోరగా వెంటనే జీజీఎంపీ ద్వారా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

అర్హతే ప్రామాణికం

అర్హతే ప్రామాణికంగా ప్రజలందరికీ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు అనేక మంచి కార్యక్రమాలు చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు ప్రభుత్వం బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. వాటిని పట్టించుకోకుండా ప్రజా శ్రేయస్సే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ప్రజలే వారికి తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల ఆదరణతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, పార్టీ మండల కన్వీనర్ మోహన్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, వైస్ ఎంపీపీ ఆదాంభాష, సర్పంచ్ మల్లికార్జున, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, రాధాక్రిష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

నేడు కీలపల్లిలో..

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం కీలపల్లి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ తెలిపారు.

ఆత్మీయ వీడ్కోలు


బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

సోమల: బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్తున్న ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం అని పీసీ కమిటీ చైర్మన్ గాలి సురేష్ అన్నారు. మండలంలోని కందూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హరినాథరెడ్డి, చాన్‌బాషా, హేమలత, జయప్రకాష్, రమణయ్య, వెంకట సుబ్రమణ్యం, వెంకటేశ్వరరావు, కిరణ్ కుమార్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, షకీల్, శివరాజ, హరినారాయణ, చంద్రయ్య, నాగరాజ పాల్గొన్నారు.